క్లుప్తంగా

కల్యాణ మండపానికి 13 ఫ్యాన్ల వితరణ



కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఫ్యాన్లు

పద్మనాభం: మండలంలోని మద్ది కల్యాణ మండపంలో బాందేవుపురం కో–ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు బుగత శ్రీనివాసరావు తన తల్లి వరాహాలమ్మ జ్ఞాపకార్థం రూ.25వేలు విలువ చేసే 13 సీలింగ్ ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు వీటిని స్విచ్ ఆన్ చేసి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో దాత బుగత శ్రీనివాసరావుతో పాటు బుగత మధు, బుగత సత్యనారాయణ, కనకల రంగయ్య, కనకల ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

జీరుపేట పెద్ద కాలువ పరిశీలన

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు జీరుపేట పెద్ద కాలువను జెడ్సీ బి.రాము బుధవారం పరిశీలించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు చిల్ల బాబయ్యరెడ్డి, జీరు వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు ఆయన స్పందించి, పరిశీలించడానికి విచ్చేశారు. పెద్ద కాలువలో మురుగునీరు గెడ్డ ద్వారా ప్రవహించడం లేదని ఈ సందర్భంగా వారు జెడ్సీ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై జెడ్సీ మాట్లాడుతూ 15 రోజుల్లో పెద్ద కాలువ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.మహలక్ష్మినాయుడు, సచివాలయ శానిటేషన్ సెక్రటరీ పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

మినీ వ్యాన్ చోరీ

తగరపువలస: చిట్టివలస కార్మికవాడకు చెందిన గుజ్జు సూరిబాబు అనే వ్యక్తికి చెందిన సుప్రో మినీ వ్యాన్ ఈ నెల 25న ఇంటి వద్ద చోరీకి గురైంది. ఈ మేరకు బుధవారం భీమిలి పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. వారం రోజుల పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలించినా వ్యాన్ జాడ కనిపించలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇటీవల ఫైనాన్స్ చేయించిన ఈ వాహనాన్ని ఇంటి ముందు పార్క్‌చేసి మరుసటిరోజు చూడగా కనిపించలేదన్నారు. ఈ మేరకు భీమిలి పోలీసులు గురువారం వాహనం చోరీపై దర్యాప్తు చేయనున్నారు.

స్పీడ్ బ్రేకర్లకు రంగులు



గండిగుండం వద్ద స్పీడ్ బ్రేకర్లకు తెల్ల రంగు వేస్తున్న సిబ్బంది

ఆనందపురం: ఆనందపురం నుంచి గండిగుండం వరకు గల సర్వీసు రోడ్లలోని స్పీడ్ బ్రేకర్లపై జాతీయ రహదారుల సంస్థ సిబ్బంది తెల్ల రంగు చారలను వేస్తున్నారు. గతంలో ఉన్న తెల్లటి చారలు వెలిసి పోవడంతో, దగ్గరకు వచ్చేవరకు వాటిని గుర్తించలేక ద్విచక్రవాహనచోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ విషయాన్ని పరిశీలించిన నార్త్ ట్రాఫిక్ సర్కిల్ సీఐ సాయి ఆదేశాలతో స్థానిక ట్రాఫిక్ ఎస్ఐ రఘురాం, సిబ్బంది జాతీయ రహదారుల సంస్థ సహకారంతో స్పీడ్ బ్రేకర్లు ఉన్న ప్రాంతాల్లో వాటిపై తెల్ల రంగు వేస్తున్నారు. తద్వారా ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని ట్రాఫిక్ ఎస్ఐ రఘురామ్ చెప్పారు.

నేడు ఆలయ వార్షిక వేడుకలు

పద్మనాభం: పద్మనాభం జంక్షన్‌లో కొలువైన షిర్డీ సాయి, పార్వతీ దేవి ఆలయాల 19వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్త మొకర అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా విఘ్నేశ్వర పూజ, మండప ఆరాధన, అభిషేకాలు, కుంకుమార్చన, కర్పూర హారతి తదితర పూజా కార్యక్రమాలు జరుగుతాయిని పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి ఆలయాల ప్రాంగణంలో భారీ అన్నదానం నిర్వహించనున్నట్టు తెలియజేశారు.

బక్కచిక్కిపోతున్న బొట్టవానిపాలెం చెరువు



ఆక్రమణలకు గురవుతున్న బొట్టవానిపాలెం చెరువు



చెరువు వద్ద పారబోసిన చెత్త, ఇతర వ్యర్థాలు



అపార్ట్‌మెంట్‌లు, లే అవుట్లకు అనధికారకంగా ఏర్పాటు చేసిన రహదారి

- మధురవాడ నడిబొడ్డున 4.50 ఎకరాల్లో విస్తరించిన చెరువు
- ఆక్రమణలతో కుంచించుకుపోతున్న వైనం
- పరిరక్షణ చర్యలు చేపట్టాలని స్థానికుల విజ్ఞప్తి

మధురవాడ: భూగర్భ జలవనరుల పరిరక్షణలో కీలక పాత్ర పోషించేవి చెరువులు. వాటి పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. కాని కొన్ని చెరువులు ఆక్రమార్కుల వక్రబుద్ధి కారణంగా బక్కచిక్కిపోతున్నాయి. అందులో ముఖ్యమైనది బొట్టవానిపాలెం చెరువు. మధురవాడ నడిబొడ్డున సర్వే నంబర్ 61లో సుమారు 4.50 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న వెంపల చెరువు అభివృద్ధి, పరిరక్షణకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. బొట్టవానిపాలెం, నగరంపాలెం, శివశక్తినగర్, అయోధ్యనగర్ ప్రాంతాల మధ్య విస్తరించి ఉన్న ఈ చెరువు ఈ ప్రాంతాలతోపాటు స్వతంత్రనగర్, మల్లయ్యపాలెం పరిసర డజనుకు పైనే కాలనీలు, గ్రామాలకు చెందిన వేలాది నివాసాలకు భూగర్భ జలవనరుల అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుంది. ఇంత ముఖ్యమైన చెరువు గత పాలకుల ఉదాసీన వైఖరి, ఇష్టానుసారంగా నిబంధనలకు విరుద్ధంగా అపార్ట్‌మెంట్లకు ప్లాన్‌లు ఇచ్చేయడం తదితర కారణాలు వల్ల ఇప్పటికే ఎకరా మేర రక రకాలుగా ఆక్రమణకు గురైంది. చెరువు గర్భంలోని కొంత భాగంలో కొందరు ఆక్రమార్కులు గృహ నిర్మాణ, ఇతర వ్యర్థాలు, చెత్తాచెదారం ఇష్టానుసారంగా వేసేస్తున్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన కొన్ని అపార్ట్‌మెంట్లు, నివాసాలకు చెందిన మురుగు నీరు కూడా ఇందులోకే వదిలేస్తున్నారు. దీంతో కాలుష్య ముప్పు కూడా ముంచుకొస్తుంది.

ఎకరా పైనే ఆక్రమణ : నాలుగున్నర ఎకరాల్లో ఎకరంపైనే చెరువును పరిసర ప్రాంత అపార్ట్‌మెంట్లు, లే అవుట్లకు చెందిన రహదారి తదితర పేర్లతో ఆక్రమించేశారు. మరికొంత మంది చెత్తాచెదారం, గృహ నిర్మాణ వ్యర్థాలు వేసేయడంతో పూడుకుపోయి కుంచించుకుపోతోంది. ఇక్కడ గతంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ హెచ్చరిక బోర్డును కూడా కొందరు అక్రమార్కులు మాయం చేసేశారు. ఇటువంటి కారణాలతో చెరువు ఉనికికే ప్రమాదం ఏర్పడే పరిస్థితులు ఉత్పన్నమయ్యాయి. జీవీఎంసీ, రెవెన్యు అధికారులు తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.

రక్షణ చర్యలు ఇలా..

- ➡ చెరువును పూర్తి స్థాయిలో సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలి.
- ➡ ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టాలి.
- ➡ మురుగు నీరు చెరువులోకి రాకుండా చూడాలి.
- ➡ పూడిక తీసి, లోతు పెంచి, జల వనరులను పరిరక్షించాలి.
- ➡ చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించి, గ్రీనరీని అభివృద్ధి చేయాలి.

టౌన్‌ప్లానింగ్ క్లియరెన్స్ అడిగాం

ఈ చెరువు అభివృద్ధి, వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి ఇటీవల పరిశీలించాం. ప్రతిపాదనలు సిద్ధం చేయడం కోసం టౌన్ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్‌ను క్లియరెన్స్ ఇవ్వమని అడిగాం. వారి నుంచి క్లియరెన్స్ వచ్చిన వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేస్తాం.

– సురేష్, ఏఈ, జీవీఎంసీ పార్క్స్

సర్వే చేసి రిపోర్టు ఇస్తాం

బొట్టవానిపాలెం చెరువును అభివృద్ధి చేయడం ద్వారా చాలా ఉపయోగం ఉంటుంది. దీని అభివృద్ధి, వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి కావలసిన విధంగా సర్వే రిపోర్టు, క్లియరెన్స్ ఇవ్వడం కోసం సిద్ధంగా ఉన్నాం.

– రఘునాథరావు, ఏసీపీ, జీవీఎంసీ జోన్–2

అర్హులకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- 8వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కొమ్మాది: కుల, మతాలకు అతీతంగా అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. 8వ వార్డు చినరుషికొండ, ఉమ్మావానిపాలెంలో బుధవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికి వెళ్లి నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన పథకాల ద్వారా ఏ కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరిందో వివరించి కరపత్రాలు అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేవా అని, లేక ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా ఉంటూ తిరిగి అధికారంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి నెలా 1వ తేదీనే పింఛన్ సొమ్ము అందిస్తున్నారని తెలియజేశారు. ప్రజా ప్రయోజనాలు తప్ప.. స్వార్థ ప్రయోజనాలకు తావు లేకుండా రాష్ట్రంలో పరిపాలన కొనసాగుతోందన్నారు. సీఎం వైఎస్ జగన్ నాలుగేళ్ల పాలనలో నవరత్నాల హామీలు 98 శాతం అమలు చేయడమే కాకుండా ప్రతి గ్రామంలో సచివాలయాలు, ఆర్‌బీకేలు, విలేజీ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజల ముంగిటకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి గ్రామానికి సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి లైట్లు వంటివి నిర్మిస్తున్నారని తెలిపారు. అనంతరం ఈ ప్రాంతంలో రూ.77 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, స్థానిక నాయకులు ఉప్పులూరి గోపి, చెన్నాదాసు, అల్లాడ ఉమామహేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

భీమిలి రోడ్డులో ఆక్రమణ తొలగింపు

తగరపువలస: భీమిలి రోడ్డును ఆనుకుని రజక సంతపేట వద్ద ఇటీవల వెలసిన గంటా ఈశ్వరరావుకు చెందిన కూరగాయల దుకాణాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం తొలగించారు. ఇటీవల భీమిలి రోడ్డులో తమకు చెందిన స్థలాలు, ఇళ్లు, వ్యాపారాలకు అడ్డంగా మరొకరు దుకాణాలు పెట్టి ఇబ్బందులు కలిగిస్తున్నారని స్పందనలో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్న సంగతి తెలిసిందే. అయినప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులలో కదలికలు లేకపోవడంతో మళ్లీ మళ్లీ ఫిర్యాదులు చేసుకుంటున్నారు. ఈ మేరకు టౌన్ ప్లానింగ్ అధికారులు భీమిలి పోలీసుల సాయంతో దుకాణాన్ని తొలగించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరూ రహదారులను ఆక్రమించి వ్యాపార సంస్థల కోసం దుకాణాలు ఏర్పాటు చేయవద్దని హెచ్చరించారు.

సౌమ్యగిరిపై కొలువుదీరిన లక్ష్మీనరసింహుడు



ప్రతిష్ఠించిన స్వామి విగ్రహం

భీమిలి: సౌమ్యగిరిపై శ్రీలక్ష్మీ నరసింహ స్వామి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. వంశపారంపర్య ప్రధాన అర్చకుడు రొంపిచర్ల సింగరాచార్యులు ఆధ్వర్యంలో ద్రోణంరాజు శ్రీనివాస వీర రాఘవరాజు, సంధ్యారాణి దంపతులచే ఉదయం ఈ ప్రతిష్ఠా కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం లక్ష్మీ నరసింహస్వాములకు కల్యాణోత్సవం జరిపించారు. పరిసర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డ్రైనేజీల పక్కన వ్యర్థాల మూటలు



సబ్బివానిపేట డ్రైనేజీలో పడేసిన వ్యర్థాల మూటలు

తగరపువలస: భీమిలి జోన్ రెండో వార్డు సబ్బివానిపేట డ్రైనేజీని ఆనుకుని వ్యర్థాల మూటల గుట్టలు కంపుకొడుతున్నాయి. ఈ ప్రాంతంలో డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసినా.. స్థానికులు ఈ మూటలను వాటిలో కాకుండా శిథిలమైన డ్రైనేజీలు, వాటి పక్కనే ఉన్న మురుగు కుంటల్లో పడేస్తున్నారు. వీటిలో ఎక్కువగా చేపలు, కోళ్ల వ్యర్థాలు ఉంటున్నాయి. దీంతో ఆ ప్రాంతంలో బ్యాక్టీరియా వృద్ధి చెంది రహదారిపై రాకపోకలు సాగించేవారి ముక్కు పుటాలు అదిరేలా దుర్గంధం వెదజల్లుతున్నాయి. చెత్తను రోడ్ల పక్కన, డ్రైనేజీల్లో వేయకుండా క్లాప్ వాహనాల వెంట వచ్చే సిబ్బందికే అందించాలని శానిటేషన్ సెక్రటరీలు దుకాణాల వద్ద ఇంటింటా అవగాహన కలిగిస్తున్నా చాలా వరకు ఆచరించడం లేదు. ఇంటి ముందు, దుకాణ సంస్థల ముందు వాహనాలు వస్తున్నా కాదని రోడ్ల వెంట పడేస్తుండటంతో పారిశుధ్య సిబ్బందిపై అధనపు పనిభారం పడుతుంది. వీటిని నివారించడానికి గాను ముఖ్యమైన కూడళ్ల వద్ద ఇటీవల అందుబాటులో ఉన్న సీసీ కెమెరాల ద్వారా వ్యర్థాలను పారవేసే వారిపై శానిటేషన్ సెక్రటరీలు, పారిశుధ్య సిబ్బంది నిఘా ఉంచారు.

శ్రీవారికి పుష్పాల సమర్పణ



శ్రీవారికి పుష్పాలు సమర్పిస్తున్న దాతలు

కొమ్మాది: రుషికొండలోని ఆలయంలో కొలువుదీరిన మహాలక్ష్మి, గోదాదేవి సహిత వేంకటేశ్వరస్వామికి నగరానికి చెందిన పాల్గుణరాజు, భారతి దంపతులు పుష్పాలను సమర్పించారు. ఏకాదశిని పురస్కరించుకుని వివిధ వర్ణాల సుమాలను స్వామి అలంకరణకు తీసుకువచ్చారు. తోమాల సేవకు 12 వేల రూపాయలను సమర్పించారు. కార్యక్రమంలో కార్తీకదీపోత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మురుగు కూపంలో తాగునీటి కుళాయి



గులమజ్జి వారి కళ్లాల్లో కుళాయి పరిసరాలు

పద్మనాభం: మండలంలోని పొట్నూరు పంచాయతీ గులమజ్జి వారి కళ్లాల్లో తాగునీటి కుళాయి ఉన్న ప్రాంతం మురుగు కూపంలా మారింది. దీని ప్లాట్‌ఫారంపై రెండేళ్ల కిందట చెట్టు పడటంతో అది శిథిలమైంది. కుళాయి చుట్టూ మురుగు నీరు చేరింది. ఇక్కడే కొంత మంది దుస్తులు ఉతుకుతున్నారు. మురుగు నీటిలో దిగి తాగునీటిని పట్టుకోవల్సిన పరిస్థితి ఏర్పడిందని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగు చర్యలు చేపట్టాలని వారు కోరారు.

జపనీస్ లాంగ్వేజ్ కోర్సు బలోపేతానికి సహకారం



తోషిబా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ బాలాజీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఆరిలోవ: జపాన్‌కు చెందిన తోషిబా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ పి.ఎం.బాలాజీ బుధవారం ఏయూను సందర్శించారు. ఈ సందర్భంగా వర్సిటీ రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం వారు సమావేశ మందిరంలో భేటీ అయ్యారు. ఏయూలో నిర్వహిస్తున్న జపనీస్ లాంగ్వేజ్ కోర్సుల గురించి చర్చించారు. ఈ కోర్సులు విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా తగిన సహకారం అందించాలని రిజిస్ట్రార్ ఈ సందర్భంగా తోషిబా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ బాలాజీని కోరారు. ఈ మేరకు స్పందించిన బాలాజీ మాట్లాడుతూ జపనీస్ లాంగ్వేజ్ కోర్సు బలోపేతం చేయడానికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. జపనీస్ ఇన్ఫర్మేషన్ అండ్ స్టడీ సెంటర్ డైరెక్టర్, ఫారిన్ లింగ్విస్టిక్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి పాల్గొన్నారు.

కమనీయం.. శివపార్వతుల కల్యాణం



ప్రత్యేక అలంకరణలో ఉమాసిద్ధేశ్వర స్వామి

పీఎం పాలెం: శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని బుధవారం కనులపండువగా జరిపించారు. పీఎం పాలెం ఆఖరు బస్టాప్ నుంచి బక్కన్నపాలెం వెళ్లే రోడ్డులో గల శ్రీ శృంగేరీ శంకర మఠంలో కొలువుదీరిన శ్రీ ఉమా సిద్ధేశ్వర స్వామి ఆలయ వార్షిక కల్యాణోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా భక్తులు ఉదయం 6 గంటల నుంచి మహా దేవునికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. సాయంత్రం 6గంటలకు శివ పార్వతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. వేడుకలను మఠం గౌరవ ధర్మాధికారి జగర్లపూడి వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

పొగాకు వద్దు.. ఆరోగ్యం ముద్దు

టొబాకో దుష్ప్రభావాలపై అవగాహన ర్యాలీలు



ఆనందపురంలో ర్యాలీ చేస్తున్న ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది



శిల్పారామంలో బ్యానర్ ప్రదర్శిస్తున్న వాకర్లు, బ్రహ్మకుమారీలు

తగరపువలస: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం సంగివలస అనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ సిబ్బంది తగరపువలస వీధుల్లో అవగాహన ర్యాలీ చేశారు. 'ఆహారం పండిద్దాం.. పొగాకు సాగు మానేద్దాం' అనే ప్రపంచ ఆరోగ్య సంస్థ నినాదంతో పిలుపునిచ్చారు. పొగాకు వినియోగం వల్ల సంభవించే దుష్ప్రభావాలను వివరించారు. దాని ప్రభావం కుటుంబంపై పడుతుందన్నారు. పొగాకు వినియోగం కారణంగా ఏటా 1.35 మిలియన్ల ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ర్యాలీలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎల్.వంశీకృష్ణారెడ్డి, అధ్యాపకులు అవినాష్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకుతో క్యాన్సర్ ముప్పు

ఆనందపురం: పొగాకు సేవించే వారిలో ఎక్కువ మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కోరాడ శైలజ అన్నారు. మండలంలోని ఆనందపురం, శొంఠ్యాం ప్రాంతాల్లో పొగాకు వ్యతిరేకంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు సేవిస్తే నెమ్మదిగా విషంలా పనిచేసి శరీరంలోని అన్ని అవయవాలు పాడై ఆరోగ్యం దెబ్బతింటుందని చెప్పారు. దీర్ఘకాలిక వ్యాధులు సంభవించవచ్చని వివరించారు. మత్తు పదార్థాలు వద్దు – ఆరోగ్యం ముద్దు అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో వైద్యురాలు షహనాజ్, సీహెచ్ఎస్ కృష్ణవేణి, హెల్త్ సూపర్ వైజర్ ఐ.గోవిందరావు, హెల్త్ అసిస్టెంట్ సత్తిరాజు, సామాజిక ఆరోగ్యాధికారి సాంబమూర్తి, సూపర్ వైజర్ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి

పీఎం పాలెం: ఆరోగ్యానికి తీవ్ర నష్టం కలిగించే ధూమపానం, పాన్‌పరాగ్ వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పిలుపునిచ్చారు. స్థానిక ఓం శాంతి బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శిల్పారామంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఆనంద్ తైక్వాండో క్లబ్ అధినేత ఆనంద్ మాట్లాడుతూ క్రీడల్లో రాణించే వారు పొగాకును బాధ్యతగా నిషేధించాలన్నారు. టొబాకోకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్, వాకర్స్, బ్యాడ్మింటన్ క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మవారికి అరటిపండ్లతో అలంకరణ



తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ సుత్తమ్మతల్లి ఆలయంలో అమ్మవారిని బుధవారం అరటిపండ్లతో అలంకరించి, భక్తులు దర్శనాలు కల్పించారు. ఈ అలంకరణలో అరటిచెట్లను కూడా ఆలయానికి, విగ్రహానికి వినియోగించారు. వారానికో అలంకరణతో అమ్మవారిని తీర్చిదిద్దుతున్న ఆలయ కమిటీ ప్రతి పౌర్ణమికి ముందు వచ్చే బుధవారం ప్రత్యేక అలంకరణలకు పాధాన్యం కల్పిస్తున్నారు. దీంతో భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకుని, భక్తి పారవశ్యం చెందుతున్నారు. ఈ ఆలయాన్ని అనుసరించి చుట్టుపక్కల ఆలయ కమిటీలు కూడా అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేసి, భక్తులకు దర్శనాలు కల్పిస్తున్నారు.

రిక్షా కాలనీలో అభయాంజనేయ స్వామి ఆలయం

నేటి నుంచి 3 రోజుల పాటు ప్రారంభోత్సవాలు



రిక్షా కాలనీలో నిర్మాణం పూర్తయిన ఆంజనేయ స్వామి ఆలయం

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు కొమ్మాది శ్రీ శివ శంకర సింహాద్రినగర్(రిక్షా కాలనీ)లో నిర్మించిన అభయ ఆంజనేయస్వామి సహిత సంపత్ వినాయక, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం, జంట నాగబంధం విగ్రహాలు మరియు పసిడి కలశ ప్రతిష్ఠాపనా మహోత్సవాలు గురువారం నుంచి 3 రోజుల పాటు జరగనున్నాయి. గురువారం ఉదయం 9 గంటలకు యాగశాల ప్రవేశం, విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనంతో వేడుకలు ప్రారంభం అవుతాయి. శుక్రవారం క్షీరాధివాసం, నిత్యహోమములు, పూజ, తీర్థ ప్రసాద వితరణ, మండప పూజ, జపం, మంగళహారతి తదితర కార్యక్రమాలు చేపట్టనున్నారు. శనివారం 7.58 గంటలకు ఆలయ విగ్రహాలు, యంత్ర ప్రతిష్ఠ ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాలన్నీ గాజువాకకు చెందిన సహస్రాధిక దేవాలయ ప్రతిష్ఠాపకులు, ఆగమ శాస్త్ర ప్రవీణ ఉప్పులూరి గోపాలశాస్త్రి పర్యవేక్షణలో జరుగుతాయని తెలియజేశారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నప్రసాద పంపిణీ చేస్తారు. కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు.

వీధి వ్యాపారుల ఉపాధికి రక్షణ కల్పించాలి



నిరసన తెలుపుతున్న వీధి వ్యాపారులు

మధురవాడ: వీధి వ్యాపారుల ఉపాధికి రక్షణ కల్పించాలని సీఐటీయూ మధురవాడ జోన్ ఉపాధ్యక్షుడు డి.అప్పలరాజు కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం 7వ వార్డు మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ రోడ్డులో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారిలో సుమారు 15 ఏళ్లుగా వివిధ రకాల చిల్ల వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్న 60 మందిపై అధికారులు ఎప్పటికప్పుడు దాడులు చేస్తూ తీవ్ర వేదనకు గురిచేస్తున్నారన్నారు. మూడు రోజులుగా దుకాణాలు తొలగించమని జీవీఎంసీ, పోలీసు అధికారులు చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా నిరసన తెలియజేశామన్నారు. వ్యాపారుల ఉపాధికి రక్షణ కల్పించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు పాపినాయుడు, వర్తకులు ఆదినారాయణ, చందు, కామేశ్వరరావు, శారద, కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఫుట్‌పాత్‌లు



కార్ షెడ్ సమీపంలో పలకలు లేని ఫుట్‌పాత్‌లు



పీఎం పాలెం: స్థానిక వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ క్రికెట్ స్టేడియం నుంచి కొమ్మాది కూడలి వరకు రహదారిలో గల ఫుట్‌పాత్‌లు ప్రమాదభరితంగా మారాయి. ఫుట్‌పాత్‌లపై అమర్చిన సిమెంట్ పలకలు మరమ్మతులకు గురయ్యాయి. వాటి స్థానంలో కొత్తవి అమర్చే పనుల్లో భాగంగా క్రికెట్ స్టేడియం కూడలి, కార్ షెడ్ మొదలుకొని కొమ్మాది జంక్షన్ వరకూ ఫుట్‌పాత్‌లపై పలు చోట్ల కాంక్రీట్ దిమ్మలు తొలగించారు. అంతవరకూ బాగానే ఉన్నా.. వాటి వద్ద ప్రమాదాన్ని సూచిస్తూ హెచ్చరిక బోర్డులు పెట్టాల్సి ఉంది. ఆ ప్రదేశాల్లో చుట్టూ రాళ్లు అమ్మర్చి హెచ్చరిక సూచికగా వాటిపై సున్నం పూస్తారు. ఇటువంటి కనీస చర్యలు జీవీఎంసీ అధికారులు తీసుకోక పోవడంతో రాత్రి వేళల్లో ఫుట్‌పాత్‌పై వెళ్లే వారు డ్రెయినులో పడి ప్రమాదానికి గురయ్యే అవకాశముంది. వెంటనే జీవీఎంసీ అధికారులు స్పందించి కాంక్రీట్ పలకలు తొలగించిన చోట హెచ్చరిక బోర్డులు లేదా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.